# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. పశ్చిమాసియా సంక్షోభ పరిస్థితులను సమిష్టి కృషితో భారత్ ఎదుర్కోంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కి బాత్ 132వ సంచికలో ఉద్ఘాటించారు.**

**2. "పీఎం సూర్య ఘర్ పథకం" దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక జీవన విధానాన్ని ప్రభావవంతంగా మారుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

**3. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**4. ఉడాన్ 2.0 ద్వారా తెలుగు రాష్ట్రాలకు విస్తృత విమానయాన ప్రయోజనాలు కలుగుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు.**

**5. రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది.**

=========================

పశ్చిమాసియా సంక్షోభ పరిస్థితులను సమిష్టి కృషితో భారత్ ఎదుర్కుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా మనసులోని భావాలను పంచుకునే మన్ కి బాత్ 132వ సంచిక కార్యక్రమంలో పలు అంశాలపై ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగించారు. అంతర్జాతీయంగా పెట్రోలు, డీజిల్‌కు కొంత ఇబ్బంది ఏర్పడినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి అందుతోన్న సహకారం, గత దశాబ్ద కాలంగా దేశంలో పెరిగిన ఇంధన సామర్థ్యం కారణంగా భారత్ లో ఇంధన భద్రత సాధ్యమైందని తెలిపారు. వీటిపై ప్రచారమవుతున్న పుకార్లను నమ్మవద్దని ప్రధానమంత్రి పేర్కొంటూ

వాయిస్ ..30... సెకన్లు

---------------------------

దేశ నిర్మాణ బాధ్యతలోమై యంగ్ భారత్ – MY Bharat సంస్థ గొప్ప భూమికను పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. మన్ కి బాత్ కార్యక్రమంలో MY Bharat సంస్థ Budget Quest కార్యక్రమం గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. బడ్జెట్ ప్రక్రియలో, విధాన రూపకల్పనలో యువతను భాగస్వాములను చేసేందుకు నిర్వహించిన Budget Quest క్విజ్ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 12 లక్షల మంది యువతీ యువకులు

పాల్గొన్నారని తెలిపారు. క్విజ్ కార్యక్రమం తర్వాత సుమారు ఒక లక్ష 60 వేల మంది యువతీ యువకులను వ్యాస రచన పోటీకి ఎంపికైయ్యారని వీరిలో తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన కోట్ల రఘువీర్ రెడ్డి రైతుల సంక్షేమానికి సంబంధించిన అంశంపై రాయడం గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు.

---------------------------

దేశ నీటి సంరక్షణలో 'జల్ సంచయ్ అభియాన్' కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన్ కి బాత్ 132వ సంచిక కార్యక్రమంలో జల్ సంచయ్ అభియాన్ పై ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఈ ఉద్యమం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల కృత్రిమ నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటయ్యాయని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో అమృత్ సరోవర్ అభియాన్ కింద దేశవ్యాప్తంగా 70 వేల అమృత సరోవరాలు ఏర్పాటైయ్యాయని ప్రధానమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 25.. సెకన్లు

---------------------------

"ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం" దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక జీవన విధానాన్ని ప్రభావంతంగా మారుస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనపై మన్ కి బాత్ కార్యక్రమంలో ఈరోజు ప్రస్తావించారు. ఈ పథకం ద్వారా విద్యుత్తు బిల్లును తగ్గించుకోవడమే కాకుండా పలువురు లబ్దిదారులు విద్యుచ్ఛక్తిని విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు. సౌర శక్తికి సంబంధించిన ఈ కార్యక్రమంలో మరింత మంది భాగస్వాములు కావాలని ప్రధాన మంత్రి పిలుపునిస్తూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఎన్టీఆర్ భవన్ లో జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ అనేక పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

ఉడాన్ 2.0 ద్వారా తెలుగు రాష్ట్రాలకు విస్తృత విమానయాన ప్రయోజనాలు కలుగుతాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించిన అనంతరం ఢిల్లీలోని తన నివాసంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉడాన్ 2.0 పథకం కింద నాగార్జునసాగర్‌లో కొత్త విమానాశ్రయం నిర్మించేందుకు వీలుంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 9 సీప్లేన్ ఏరోడ్రోమ్‌లనూ ఈ పథకం కింద అభివృద్ధి చేయొచ్చని వెల్లడించారు. అలాగే కర్నూలు, కడప విమానాశ్రయాల నుంచి ఢిల్లీతో పాటు ఇతర నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభించడానికి ఉడాన్ 2.0 పథకం ఉపయోగపడుతుందని వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో టిడ్కో గృహాలను త్వరలోనే సిద్ధం చేసి లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ

మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, టిడ్కో గృహాలను పూర్తి చేసేందుకు 4 వేల 400 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయిస్తోందని చెప్పారు. విదేశాలలో నిర్మించిన గృహాల నమూనాలను పరిశీలించి నిర్మాణాలను చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సహకాలతో దేశంలోని పెట్టుబడులలో 20 శాతం రాష్ట్రానికే వస్తున్నాయని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవోగా బదిలీ చేసింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఎండీగా బదిలీ చేయగా.. గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న తమిమ్ అన్సారియాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా... బదిలీ చేసింది. అలాగే గుంటూరు జిల్లా కలెక్టర్‌గా.. సాయికాంత్ వర్మను, విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా.. అభిషిక్త్ కిశోర్‌ను, కాకినాడ జిల్లా కలెక్టర్‌గా.. హరేంద్రప్రసాద్‌ను, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా... టి.నిశాంతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

దేశంలో తగినంత చమురు నిల్వలు, సరఫరా వ్యవస్థ బలంగా ఉన్నాయని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు డి.పురంధరేశ్వరి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ సుంకం తగ్గింపులపై పురంధరేశ్వరి ఒక వీడియో సందేశం ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

ప్రజారోగ్య శాఖ ద్వారా వైద్యాధికారుల ఉద్యోగాల భర్తీని తొలిసారిగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించనున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఈరోజు ఒక ప్రకటలో వెల్లడించారు. ఎంబీబీఎస్ అర్హతతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ –సీఏఎస్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి పారదర్శక విధానంలో నియామక ఉత్తర్వులను ఆన్లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఇవ్వనున్నామని చెప్పారు. ఏపీ ఆన్‌లైన్ సహకారంతో రేపటి నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్ పోస్టింగ్ ఉత్తర్వుల జారీ ప్రక్రియను 34 గంటల్లోపే ముగిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు ఇచ్చిన ఐచ్ఛికాలకు అనుగుణంగా 611 వైద్యుల నియామక ఉత్తర్వులను ఆన్ లైన్ ద్వారానే ఇస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ రేపు పాల్గొంటారని విశ్వవిద్యాలయం ఉపకులపతి జె.వి.రమణ తెలిపారు. స్నాతకోత్సవ ఏర్పాట్లపై తిరుపతిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ పాల్గొని, వివిధ కోర్సులు పూర్తి చేసిన 415మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తారని చెప్పారు.

=====================